# సేవయే గొప్ప సాధనగా విశ్వసించాలి!

మనసే ముక్తికి ముఖ్యము
మనసే నరకంబు తెచ్చు మైమరపించున్
మనసే కారణంబు మరియెందు వుండిన
ఇల్లు అడవి ముక్తినియ్యలేవు
మనసులేనివాడు మందిరముననున్న
కాననముననున్న కార్యమేమి?

దివ్యాత్మస్వరూపులారా!

ఇంద్రియములతోకూడిన యీ పాంచభౌతికమైన శరీరము మనసుకంటే వేరైనది కాదు. మనసు తన విలాసార్థమై యేర్పరచుకొన్న కవచమే యీ శరీరము. అన్ని దేహములకు మనసే మూలాధారము. నీరులేని పంటయొక్క అస్థిత్వము యెంత మిథ్యామాత్రమో, మనసులేని శరీరముయొక్క మిథ్యాత్వముకూడను అట్టిదే! మనసుయొక్క తత్త్వమును ప్రతీ వ్యక్తి గుర్తించి వర్తించినప్పుడే దీనియొక్క స్వస్వరూపాన్ని గుర్తించటానికి వీలవుతుంది. ప్రపంచములో సర్వ వ్యాపారములకు, కార్యకలాపములకు యీ మనసే మూలకారణము. పంతులులేని బడి, దేవుడులేని గుడి యేవిధముగా వ్యర్థమో, అదేవిధముగనే మనసులేని శరీరముకూడను నిరుపయోగమవుతుంది. సామాన్యముగా మానవులు యీ మనసు శరీరముతో బంధింపబడినదని విశ్వసించి కేవలము శరీర పోషణార్థమై అనేక విధమైన పాట్లు పడుతుంటారు. సమస్త భోగభాగ్యములకు యీ శరీరమే మూలకారణమని విశ్వసించి యిందులోనే బంధింపబడుతున్నాడు, మానవుడు. ఇట్టివాడు యెన్ని విధములైన సేవలు సల్పినప్పటికి వున్నత స్థాయిని చెందలేడు.

srisathyasaivachanamrutam

## మనస్సు సంకల్పమయమైనది

మనస్సనేది కేవలము ఒక పరిశుద్ధమైన తెల్ల కాగితమువంటిదికాదు. ఇందులో అనేక జన్మలయొక్క సంకల్పములు ముద్రింపబడి వుంటున్నవి. అనేక కర్మలయొక్క ఫలితముకూడను యిందులో ముద్రింపబడివుంది. సంకల్పమయమైనదే యీమనసు. మానవునకు యిక్కట్ల సమయమునందు, ఆపత్సమయములయందు యీసంకల్పములు అనేకమైన వుపకారములు సల్పటానికి సిద్ధముగా వుంటాయి. మనసు సత్సంకల్పములతో నిండినప్పుడు మానవుని యెంతటి వున్నత స్థాయికైననూ గొనిపోతుంది. సంకల్పముల బీజమునుండియే కర్మ అనే ఫలము ఆవిర్భవిస్తుంది. కర్మబీజమునుండే అభ్యాసము అనే ఫలము పుడుతుంది. ఈ అభ్యాసమనే బీజమునుండియే శీలము అనే ఫలము ఆవిర్భవిస్తుంది. ఈ శీలమనే బీజమునుండియే అదృష్టమనే ఫలమును మనము అందుకుంటున్నాము. ఈ అదృష్టమనే ఫలమును మనము ఆరగించాలనుకున్నప్పుడు పవిత్రమైన గుణశీలుడు కావాలి. గుణశీలుడుగా నిర్వర్తించవలెనన్న సదభ్యాసములు అభివృద్ధిపరుచుకోవాలి. సదభ్యాసములను అలవరచుకొనవలెనన్న సత్కర్మలలో మనము ప్రవేశించాలి. సతక్కర్మలయొక్క ఫలితమును మనము అందుకొనవలెనన్న సంకల్పములు సరైన సంకల్పములపైననే ఆధారపడి వుంటుండాలి. ఏతావాతా మానవునియొక్క అదృష్ట, దురదృష్టములంతా అతని సంకల్పములపైననే ఆధారపడి వుంటున్నవి. సత్సంకల్పములనే అభివృద్ధి పరచుకున్న అతనికంటె అదృష్టవంతుడు మరొకడుండడు. అతడు అనుభవించలేని ఆనందముకానీ, పొందలేని స్థానముగానీ, చెందలేని సంస్కృతిగాని మరొకటి వుండదు. అట్లుకాక, కేవలము దుస్సంకల్పములనే అభివృద్ధిపరచుకున్న దుష్టుడై, దుర్మార్గుడై, దురాచారపరుడై హీనస్థితిని అనుభవించక తప్పదు.

## మానవుని స్థితిగతులన్నియు తన సంకల్పములపైననే ఆధారపడి వుంటవి

మానవునియొక్క స్థితిగతులన్నియుకూడను తనయొక్క సంకల్పములపైననే ఆధారపడి వున్నాయి. ఈ సత్సంకల్పములనేవి కేవలము సత్సంగమునుండియే లభ్యమౌతాయి. సత్సంగముచేత సత్సంకల్పములు పోషించుకున్నప్పుడు సదభ్యాసములో మనజీవితమును

సార్థకము గావించుకుంటాము. అయితే యీనాడు మానవుడు తనకు తోచినట్లుగా సంకల్పములను అభివృద్ధి పరచుకుంటున్నాడేగాని, యిది మంచిదా చెడ్డదా అనే విచారణశక్తి లేకుండా వుంటున్నాడు. కిరాతకునిగా వుండిన రత్నాకరుడు మహర్షులయొక్క సంపర్కముచేత రామాయణకర్తగా వాల్మీకిగా మారిపోయాడు. అంగులీమాలుడు అనే మహాదుష్టుడుకూడను బుద్ధునియొక్క సంపర్కముచేత, సద్బోధలచేత, సత్సంకల్పములు పెంచుకొని తానుకూడా పరమ భక్తునిగా మారిపోయాడు. జగాయి, మాదాయి అనే మహాదొంగలు కిరాతకులైనవారు. చైతన్యునియొక్క సంపర్కముచేత వారు సద్గుణములు, సంకల్పములు పెంచుకొని జీవితము సార్థకము గావించుకొన్నారు. కనుకనే మానవునికి సత్సంగమనేది అత్యవసరము. చుట్టువున్న సంఘమయెట్టిదో తనయొక్క సంకల్పములుకూడను అట్టివిగా రూపొందుతాయి. అదియే tell me your company, I shall tell you what you are. కనుకనే మనము మంచివారితో చేరాలి. సద్గుణములనుపెంచుకోవాలి. సదభ్యాసములు చెయ్యాలి. సత్కర్మలలో ప్రవేశించాలి. ఈ అన్నింటికిని సంకల్పములే మూలకారణము. కేవలం ఒక్క భారతదేశమునందేకాక, యితర దేశములందుకూడను యిట్టి సత్సంకల్పములచేత సరైన స్థితిని పొందినవారు, సంకల్పములు పెంచుకున్నవారు అనేకమంది కలరు.

పూర్వము యింగ్లడులో ఒక వ్యక్తి కవర్లపైన ఎడ్రసులురాసి, వారు యిచ్చే కానీ, అరకానీ తాను పుచ్చుకొని జీవితము గడపుతూ వుండేటువంటివాడు. అతను నిరంతరము దైవచింతనతో తన హృదయాన్ని నింపుకుంటూ వుండేవాడు. ఆ ఎడ్రసు రాసి తిరిగి వాళ్లకు యిచ్చే సమయములో God bless you అనేవాడు. కొన్ని కొన్ని సమయములలో God is great అనేవాడు. మరికొన్ని సమయములలోపల Trust in God అనేవాడు. అయితే, యితని జీవితము దినదినమునకు దిగజారిపోతూ వచ్చింది. బ్రతకటమే కష్టమైంది. కాని అతనియొక్క సంకల్పములు పవిత్రమైనవిగా వుండటంచేత, కొంతకాలమునకు అతనికి మంచిరోజులు వచ్చాయి. బ్రిటీషుదేశమునకు Prime Minister అయ్యాడు. అతనే James Mcdonald. యిలాంటి వ్యక్తులు యింకను యెంతమందో జగత్తులో వుంటున్నారు అయితే కొంతమందికి యిట్టి విషయములలో విశ్వాసము వుండదు. నిజానికి, విశ్వాసముకూడను

sri sathyasai vachanamrutam

ఒక అదృష్టమే! అదృష్టవంతులే యిట్టి పవిత్రమైన విషయములు విశ్వసిస్తూవుంటారు. అయితే నేటికాలమునందుకూడను యిలాంటి పవిత్రమైన సంకల్పముల ప్రభావాన్ని ప్రత్యక్షముగా నిరూపించిన వ్యక్తులు అనేకమంది వుంటున్నారు.

**సత్సంకల్పములు ఏనాటికి నశించేవికావు**

పూర్వము మద్రాసు రాష్ట్రములో ఒక కుగ్రామములో యిరువురు అన్నదమ్ములు ఉండేవారు. వారిలో పెద్దవాడైన సోదరుడు మొదట్లో చాలా దుర్గుణములు కల్గి కొన్నాళ్ళకు సదాచారములచేత, సత్కర్మలలో ప్రవేశించాడు. వీరిది బీదకుటుంబము. రెండవవాడు దుష్టులతో చేరి కాలమునంతా వ్యర్థముచేస్తూ అపవిత్రకర్మలను ఆచరిస్తూవుండేవాడు. దుస్సంగము అతిసులభముగా లభిస్తుంది. సత్సంగము అంతసులభముగా మనకు లభించేదికాదు. కొండనుంచి గుండును కాలితో నెడితేకూడను క్రింద పడిపోతుంది. కానీ, క్రింద వుండినటువంటి గుండును కొండపైకి తీసుకుపోవటము చాలా కష్టము. అధోగతికి దిగజారిపోటము సులభము. అయితే, యీ సోదరుడు దుష్టులతో చేరి కొంతకాలములో భ్రష్టుడయాడు. ఈ దుష్ట స్నేహితుల ప్రోత్సాహముచేతను, ప్రోద్బలముచేతను అన్నపైన కొంత విరోధము పెంచుకున్నాడు. కడపటికి అతడు వుంటున్న ఒక చిన్నయిల్లుపైనకూడను అతను దావావేసి అన్నను కోర్టుకు లాగాడు. అయితే, నిజముగా అన్న స్వయముగా సంపాయించుకున్న గృహమది. తాతలది కానీ, తండ్రులది కాని కాదు. అన్యాయముగా కోర్టుకు లాగి అన్నను యనేక విధములైన బాధలు పెట్టాడు. అందులో కొంతమంది లాయర్లు ధనముకోసమై లొంగి కోర్టులో వేసిన కేసులో అన్నను అపజయము గావించారు. కోర్టులోపల అన్న ఓడిపోయాడు. 'సత్యమునకు కాలమే లేదా, ధర్మమునకు అవకాశమే లేదా', అని నిరంతరము చింతించి, చింతించి అతను ప్రాణము వదిలాడు. అతనికి ఒక కుమారుడు, భార్య వుండేవారు. ఆ తల్లికూడను చాలా బాధపడి ఆ కుమారుని తీసుకొని యేదో ఒక విధముగా ఆ కుమారుని అభివృద్ధిలోనికి తీసుకురావాలనే వుద్దేశ్యముతో మద్రాసు పట్టణము వచ్చి చేరింది. కొన్నాళ్ళపాటు ఆ తల్లీబిడ్డలు తినటానికి తిండిలేక, వుండటానికి యిల్లులేక అనేక బాధలు పడ్డారు. కడపటికి ఆమె యెక్కడో అక్కడ కూలి, నాలి

sri sathyasai vachanamrutam

చేసుకొని సంపాదించి కొడుకును యేదో ఒక విధముగా అభివృద్ధిగావించాలని ప్రయత్నము చేసింది. కుమారుడుకూడను కలవారిని ఆశ్రయించి పూటకూళ్లలో తిని, బజార్లలో వెలిగే లైట్లముందర కూర్చొని చదువు ప్రారంభించాడు. టీ, కాఫీ తాగటానికి ఒక కాసైనా అతని జేబులోలేదు. కానీ కష్టపడి చదివి కుళాయి నీళ్లతో కడుపు నింపుకుని తన దేహము కాపాడుకుంటూ వచ్చాడు. ఈనాడు యింటర్మీడియట్‌నే పూర్వము FA అని పిలిచేవారు. కష్టపడి FA పాస్‌చేశాడు. అతడు వుత్తీర్ణుడయ్యాడనే విషయము తల్లికి తెలిసింది. పట్టలేని ఆనందముతో కొడుకును ఒడిలో పెట్టుకొని చాలా ఆనందించింది. తన సత్సంకల్పములచేత ఆ కుమారుని ఆశీర్వదించింది, "నాయనా! అన్యాయ, అక్రమ, అనాచార, అక్రమములు ప్రబలిపోవటంచేతను, సత్యమునకు ధర్మమునకు కాలములేకపోవటంచేత నీ తండ్రి అశాంతితో మరణించాడు. ధర్మదేవతకూడను క్రోధము పూనింది. ఈనాడు లోకములో న్యాయమనేది యేమాత్రముకూడను కనుపించటములేదు. చదువుకున్నవారు స్వార్థ, స్వప్రయోజనముల నిమిత్తమై ఉద్యోగములు చేయుచున్నారేగాని న్యాయము, ధర్మము, దేశమునకు నీతినిజాయతీలు అందించటానికి తగిన కృషిచేయడంలేదు. ఎవరు యెక్కువ ధనమిస్తే అతనివైపున న్యాయమని వాదిస్తారు, లాయర్లు. ఈ విధముగా చేసి మనవలె యెన్ని కుటుంబములో నాశనము చేసిన లాయర్లయొక్క బిడ్డలు సుఖజీవనము గడిపినవారిని నేను యింతవరకు కంటితో చూడలేదు. ఏదో రోగములో, బాధలో, యింకేవిధమైన రౌడీఫ్రెండ్‌షిప్‌తో కలసి యీయొక్క సంపాయించిన ఆస్తినంతా నిర్మూలముగావించుకొనేవారిని మాత్రమే నేను చూచాను. కనుక, మరణించిన తండ్రికి నీవు శాంతిని చేకూర్చాలనుకున్నప్పుడు నీవు యెట్లైనా సరియే LLB చదివి లాయరై శాశ్వతమైన ధర్మాన్ని ప్రపంచానికి చాటా"లని ఆశీర్వదించింది. తల్లియొక్క ఆశీర్వాదములు పొంది, ఆ కుమారుడు తల్లి ఆజ్ఞాప్రకారము LLBలో చేరాడు. తల్లిమాటలను హృదయములో పెట్టుకున్నాడు. క్షణక్షణము తల్లియొక్క బోధనలంతా జ్ఞాపకము తెచ్చుకున్నాడు. కష్టపడి చదివాడు. వుత్తీర్ణుడయ్యాడు. ప్రాక్టీసు ప్రారంభించాడు. "నా తండ్రియొక్క ఆత్మకు శాంతి చేకూర్చాలి. యిది నా తల్లి ఆజ్ఞ. నా blood నా food నా head నా parents gift. కనుక నా bloodనంతాకూడను తల్లితండ్రులకు అర్పితము

sri sathyasai vahanamrutam

గావించాలి. అదియే మాతృదేవోభవ, పితృదేవోభవ" అని తీర్మానించుకున్నాడు. తల్లితండ్రులను సంతోషపెట్టే నిమిత్తమై సత్సంకల్పములను నిరంతరము పోషించుకుంటూవచ్చాడు. సత్సంకల్పములు యేనాటికి నశించేవికాదు. మనిషి మరణించినాకూడను మన సంకల్పములు మరణించేవికావు. సంకల్పములు చాలా బలమైనవి. పవిత్రమైనవి. శాశ్వతమైనవి. కొంతకాలములోపలనే భారతదేశము స్వాతంత్ర్యమునందుకొంది. స్వతంత్రమువచ్చిన తరువాత మద్రాసు హైకోర్టులో ప్రధానన్యాయమూర్తి యితనే అయ్యాడు. అతనే ముత్తుస్వామి అయ్యర్. తన కుమారుడు ప్రధానన్యాయమూర్తి అయ్యాడని విని ఆనందముతో కొంతకాలములోపలనే ఆ తల్లి కన్నుమూసింది. చూచారా! తల్లియొక్క సంకల్పము, కుమారునియొక్క సంకల్పము యెంత పవిత్రమైన విజయాన్ని అందించిందో! ఆనాటినుండికూడను యీ ముత్తుస్వామి అయ్యర్ గొప్ప కీర్తిని సాధించాడు.

**కోరికలు పెరిగేకొలది ఇచ్ఛాశక్తి తరుగుతూ వస్తుంది**

కీర్తి యెలాంటిదంటే, ప్రవాహమువంటిది. నది పుట్టినప్పుడు చాలా చిన్నదిగా వుంటుంది. కాని, క్రమేణా అది గొప్పగా అభివృద్ధి గాంచుతుంది. సంకల్పములే ఇచ్ఛాశక్తిని అభివృద్ధి పరుస్తాయి. ఇచ్ఛాశక్తినుండియే వాక్‌శక్తి, విచక్షణాశక్తి, మేధాశక్తి, విచారణాశక్తి యిలాంటి శక్తులన్నీ ఆవిర్భవిస్తున్నాయి. ఇచ్ఛాశక్తి పవిత్రముగా వుండినప్పుడువాడు ఇంద్రుడు, దేవేంద్రుడు కావచ్చును. యిట్టి యిచ్ఛాశక్తి ప్రతి మానవునియందు వుంటున్నది. అయితే యీ యిచ్ఛాశక్తి క్రమేణా తరిగిపోటానికిగాని, నశించిపోవటానికిగానీ కారణము యేమిటి? మానవునికి కోరికలు పెరుగుతూ పోయేకొలది యిచ్ఛాశక్తి తరుగుతూ వస్తుంది. ఈనాడు మితిమీరిన కోరికలు కావటంచేతనే యిచ్ఛాశక్తి గతితప్పి నడుస్తున్నాది. యిచ్ఛాశక్తి తనయందు బలహీనం కావటంచేతనే మానవుడు తాను అనుభవించవలసిన ఆనందమునుగానీ శాంతిగానీ అనుభవించలేకపోతున్నాడు. ఒక్కటి మాత్రం ప్రత్యక్షముగా అనుభూతికి తెచ్చుకోటానికి ప్రాక్టీసుచేయండి. ఒకనికి యిరవై ఆశలు వుండవచ్చు. కాఫీకావాలి, గంజాయికావాలి, సిగరెట్టుకావాలి, బీడీలుకావాలి, పేకాటఆడాలి,

sri sathyasai vachanamrutam

యీరకమైన ఆశలు యెన్నోవుంటున్నాయి, మానవునికి. ఈ కోరికలు ఒక్కొక్క దానిని, ఒక్కొక్క దానిని తగ్గించుకుంటూరండి. మీ యిచ్ఛాశక్తి క్రమక్రమేణా పెరుగుతూవస్తుంది. కనుక, మన యిచ్ఛాశక్తి తరిగిపోవుటకుగాని పెరిగిపోవుటకుగానీ మనకోరికలే మూలకారణము. ఈ కోరికలు అరికట్టుకొనుటకు మార్గము యేమిటి, మీరు విచారణ చెయ్యండి.

**మానవులందరూ ఒక్కటే అనే సత్యాన్ని మనము గుర్తించాలి**

మీరు పుట్టక పూర్వము యీ జగత్తు యెక్కడ వుంటున్నది? పుట్టిన ప్రతి జీవి గిట్టక తప్పదు. మరణించిన తరువాత యీ జగత్తు యెక్కడ వుంది? మధ్యలో వచ్చి పోయేటువంటిదే యీ జగత్తు. చావుపుట్టుకలకు మధ్యలో కనుపించేది యీ జగత్తు. ఇలాంటి జగత్తును మనము లక్ష్యములోనుంచుకొని మనము దీని నిమిత్తమై ప్రాకులాడటము యెంత వెఱ్ఱితనము! ఈ జగత్తంతయు అద్దమువంటిది. నీవు అద్దముముందు వుండినంతవరకే నీ ప్రతిబింబము అద్దములో కనుపిస్తుంది, అద్దము ప్రక్కకు నెట్టితే నీ ప్రతిబింబమేలేదు. ఇలాంటి క్షణభంగురమైన, అస్థిరమైన యీ జగత్తునందు కోరికల నిమిత్తమె మానవజీవితాన్ని వ్యర్థముగావించుకోటం నిరర్ధకమనే సత్యాన్ని మీరు గుర్తించాలి. ఈ విధంగా మనము కేవలం స్వార్థమునకు గురియై పరార్థమును విశ్వసించక, జీవితాన్ని వ్యర్థము చేసుకుంటున్నాము. అశాశ్వతమైన నీటి బుడగపైన నిర్మించుకున్న యీ జీవితసౌధము యే క్షణములో మునిగిపోతుందో! అందువల్లనే ఉపనిషత్తులు 'ఉత్తిష్ఠత, జాగ్రత. ప్రాప్యవరాన్నిబోధత' అని ఉద్బోధించాయి. అనగా, అజ్ఞానమనే నిద్రనుండి లేచి సత్యాన్ని గురించుకోమని వుపదేశిస్తున్నాయి. యీవిధమైన జ్ఞానము మనకు యెప్పుడు లభిస్తుంది? 'మానవులందరూకూడను ఒకటే', అనే సత్యాన్ని మనము గుర్తించాలి. సత్యమే దైవస్వరూపము. మనము ప్రేమించవలసినది సత్యమునే!

**పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి ఈ మూడు మానవునకు ప్రధానమైన విలువలు**

యీ జగత్తంతయుకూడను మిథ్యమైనది. దీనిని మనము విశ్వసించి అనేక రకములైన



sri sathyasaivachanamrutam

పాపములకు గురైపోతున్నాము. ఈ పాపములయొక్క ఫలితమును అనుభవించక తప్పదు. కనుక, పాపభీతిని అభివృద్ధి చేసుకోవాలి. దైవప్రీతిని పెంచుకోవాలి. సంఘములో నీతిని మనము అభివృద్ధి గావించుకోవాలి. కనుక, మానవునికి ప్రధానమైన విలువలు యీ మూడు మాత్రమే! పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి. పాపభీతిలోనే అహింస, శాంతము మనకు లభిస్తాయి. దైవప్రీతి సత్య, ప్రేమలను అభివృద్ధిపరుస్తుంది. సంఘనీతియే మన ధర్మము. ప్రతి మానవుడు మానవతా విలువలని సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ అనేటువంటి చిలుకపలుకులు పలికినంతమాత్రమున ప్రయోజనములేదు. సామాన్య మానవుడు నిత్యజీవితములో దైవత్వాన్ని అనుభవించటానికి ప్రయత్నించాలి. మానవతా విలువలనేవి మానవుడుగా జన్మించిన ప్రతివానికి వుండవలసినదే! మానవతావిలువలు లేకపోవటంచేతనే యీనాడు జగత్తులో యనేక విధములైన దుష్టకృత్యములు చూడగలుగుతున్నాము.

**లోకమందు పెక్కు భీకరకృత్యముల్**
**జరుగుకారణంబు అరయవలయు**
**స్వార్థరహితసేవ సన్నగిల్లుటచేత**
**అర్థరహిత వాంఛలధికమయ్యె**
**పాపభీతిలేని పామరత్వముబట్టి**
**దైవప్రీతిలేని దానిబట్టి**
**మానవత్వమడగె మానవులందున**
**విశ్వశాంతికిదియె విప్లవంబు**

ఈ విధమైన విప్లవాన్ని మనము అనుభవించటానికి కారణమేమిటి? పాపభీతి లేకపోవటంచేతను, దైవప్రీతి కోల్పోవటంచేతను మానవతలో విలువలు మనము కోల్పోయినాము. మానవునియొక్క విలువలేమిటి? పాపభీతి, దైవప్రీతి యీ రెండే గొప్ప విలువలు. కనుక దుష్కర్మలు, దురాలోచనలు, దుర్బుద్ధులచేత జీవితాన్ని వ్యర్థముగావించే పరిస్థితికి మనము దూరముగా వుంటుండాలి. ఏ సాధనలు చేయకపోయినప్పటికి, సేవయే

srisathyasaivachanamrutam

గొప్ప సాధనగా మనము విశ్వసించాలి. సేవకంటె మించినది మరొకటిలేదు. పరులయొక్క చెడ్డనుగాని, పరులయొక్క దుర్మార్గముగాని విమర్శించటానికి మనము పూనుకొనకూడదు. పరదూషణ మహారోగము. ఇది యెలాంటి నివారణలేనటువంటి రోగము. దీనికి మందులేదు.

**పరుడు, పరుడుకాదు పరమాత్ముడే!**

పరదూషణ అనేది cancer రోగమువంటిది. ఎవరిని, ఎట్టి విషయములోకూడను విమర్శించటంకాని, దూషించటంకాని, పరిహసించటముగాని, అగౌరవపరచటంగాని మనము చేయరాదు. ఇతరులను దూషించటముచేత మనము అనేక దుర్బుద్ధులలో మునిగిపోతాము.

**దూషణంబు హింస దూరంబుగా నెట్టి**
**దైవచింత తాను దండిపరచి**
**ప్రేమతోడ తాను ప్రజలను చూచిన**
**దైవప్రేమ తనకె దండివుండు**

కనుక, మనము దూషణ, పరహింస యివి దూరముగా నెట్టటానికి ప్రయత్నించాలి.

**పరులతిట్టినంత పాపఫలంబబ్బు**
**విడువదెన్నటికిని విశ్వమందు**
**పరుడు పరుడుకాదు పరమాత్ముడేనయా**
**సత్యమైన బాట సాయిమాట**

ఎవరో పరుడు నాకు విరోధి అని యెవరినో మనము యిష్టము వచ్చినట్లుగా దూషిస్తాము. కాని అతను పరుడుకాదు, పరమాత్ముడే! కనుక, మానవులు ఒకరినొకరు ద్వేషించే దుష్టభావానికి యేమాత్రము హృదయములో అవకాశము యివ్వరాదు. అహంకారము అధికమవటంచేతనే, ఆడంబరములను పెంచుకోటం చేతనే, అన్యులను పరులుగా భావిస్తున్నారు. కాదు కాదు. నీ యెదురుగా వుండిన ప్రతిజీవికూడను పరమాత్మస్వరూపుడే!

sri sathyasai vachanamrutam

జగత్తంతకు నాయకుడు అతనే! సూత్రధారి, పాత్రధారికూడను అతనే! ఎవరైనా వ్యక్తి యెదురుగా వచ్చి నిన్ను దూషిస్తున్నాడంటే నువ్వు నవ్వుతూ 'అహా! పరమాత్ముడు ఆ రూపములో వచ్చి యీ రూపాన్ని విమర్శిస్తున్నాడు. సర్వరూపములు తనవే! కాన, దూషించేవాడు తానే, దూషించబడేవాడూ తానే', అనుకో! అనేకమంది అనేక విధములైన దుఃఖములకు గురౌతుంటారు. 'అయ్యో! నేను భగవంతుని పూజిస్తున్నానే, భగవంతుని ప్రార్థిస్తున్నానే! యీ దుఃఖములు, కష్టములు, అన్యాయములు యేనాడు నాకు దూరమౌతాయి, ఈ బాధలు విమోచన చేయకుండా పోతున్నాడే, భగవంతుడు', అని బాధపడుతుంటారు మానవులు. ఇది చాలా పొరపాటు. దుఃఖములకు కన్ను, ముక్కు, కాళ్లు, చేతులు లేవు. లేక విచారములకు అంగములే లేవు. మనకు అయిష్టమైనవి, అనాహతమైనవి యీ దుఃఖములు. దీనికి మనము వగచి ప్రయోజనమేమిటి? ఈ దుఃఖములు భ్రాంతులేగానీ, నీకు లభించిన వస్తువులుకాదు. భగవంతుడనేవాడు ప్రత్యేకముగా మానవునకు దూరముగా లేడు. పురాణములు, ఇతిహాసములు, ఉపనిషత్తులు యివన్నీ భగవంతుడు ప్రత్యేకముగా వుండినట్లుగాను భక్తుడు అతనిని పొందటానికి ప్రయత్నించినట్లుగాను బోధిస్తున్నాయి. ఇది సరైన భక్తికాదు. భగవంతుడు వేరు, నేను వేరు అని భేదభావము వుండినంతవరకు మానవుడు స్వార్థము, స్వప్రయోజనముతోనే నిండివుంటాడు. ఈ ద్వైతభావమును మనము దూరము నెట్టాలి. ఏకాత్మభావాన్ని పెంచుకోవాలి. దివ్యత్వముతోనే జీవితము అంత్యము చెయ్యాలి.

**నీకు నీవు ఎంతదూరమో, దేవుడు నీకు అంత దూరము**

ఒకరు వచ్చారు. 'స్వామీ! బ్రహ్మసత్యం, జగత్‌మిథ్య' అని ఉపనిషత్తులు చెప్పుతున్నాయి కదా', అని అడిగాడు. నేను జవాబు చెప్పాను, "బ్రహ్మసత్యం జగత్‌మిథ్య అనే విషయం అటుంచు. ఈ జగత్తును పట్టుకొని యిది మిథ్యయో సత్యమో నీకెందుకు? జగత్తును నీవు బాడుగకు తీసుకోలేదు. కాంట్రాక్టు తీసుకోలేదు. ఈ జగత్తును జగత్తుకే వదలిపెట్టు. మొదట నీవు సత్యమో కాదో విచారించుకో"మన్నాను. తాను సత్యమోకాదో అనే సత్యాన్ని గుర్తించుకోకుండా జగత్తు మిథ్యయా లేక బ్రహ్మసత్యమా యీ విధమైన దీంట్లో మనము

వాదోపవాదాలకు దిగటము మంచిది కాదు. అటువంటి వ్యక్తి కేవలం వ్యర్థ జీవితము గడపినవాడే! ఇలాంటి విచారణలో మనము యేమాత్రము ప్రవేశించకూడదు. పనిలేనివారే యీ పనులంతా పెట్టుకుంటారు. ఇంకా కొంతమంది పూజలు, వ్రతాలు అనే భ్రాంతిలో వుంటారు. ఎవరిని పూజించేది? దీనికి నా వుద్దేశ్యము యేమంటే వ్యక్తిగతమైన పూజలో, వ్రతములో, ధ్యానములో, జపములో, మీ యిష్టము కొలది మీరు చేసుకోవచ్చును. తాను అందుకొనేవాడుకాదు, నీవు చేసేవాడుకాదు. నీకు పూజచెయ్యాలని యెక్కువ అభిలాషనే వుంటుంటే నిన్ను నువ్వు పూజ చేసుకో! అది చాలా గొప్పది. మీలోలేని దేవుడు వేరే బయట యెక్కడ వుంటున్నాడు? దేవుడు యెక్కడ వున్నాడని దేవుళ్లాడటానికి ప్రయత్నిస్తే నీకు నీవు యెంత దూరమో దేవుడు నీకు అంతదూరము. నీకు నీవు యెంత సన్నిహితముగా వున్నావో దేవుడు నీకు అంత సన్నిహితముగా వుంటాడు. నీకు నీవు దూరమైనవానికి దేవుడు దూరముగా వుంటున్నాడు. కనుకనే నీకు నీవు సమీపుడుకా! అప్పుడే నీకు దైవత్వము అనేది అర్థమవుతుంది.

**అహంకార రహితముగా కర్మలు ఆచరించటమే అకర్మ**

మనసును అరికట్టి మనోనాశనము చెయ్యాలని కొంతమంది ప్రయత్నిస్తుంటారు. 'ఇదంతా కర్మలద్వారా యేర్పడినది. కనుక యీ కర్మలే నేను మానివెయ్యాలి' అని చెప్పుకుంటారు. అకర్మ అంటే యేమిటి అర్థము? కర్మలు చేయకుండా వుండటమా? కాదు కాదు. ఇది సోమరితనము. అకర్మ అనగా అహంకారము విసర్జించటమే! అహంకారరహితముగా కర్మలు ఆచరించటమే అకర్మ. ఇంకా మరి కొంతమంది ముక్తికోసమని ప్రయత్నిస్తున్నామంటున్నారు. అహంకారమును దూరము చేయటమే ముక్తి. ఈ అహంకారము వుండినంతవరకు నీకు బంధమే! ఈ అహంకారమును దూరము గావించుకొంటిమా బంధవిముక్తుడౌతాము. ఈ అహంకారమనేది, మమకారమనేది మనము ఆహ్వానించుకొన్నదే!

**ప్రేమ, సేవ రెండూ రెక్కలువంటివి**

ప్రతి మానవునియందు దైవత్వము వుంటున్నాదనే సత్యాన్ని మనం గుర్తించి వర్తించాలి.

srisathyasaivachanamrutam

ఒకడు సన్యాసి వేషము వేసుకునివుంటాడు. 'నేను సన్యాసి, సన్యాసి' అని చెప్పుకుంటూవుంటాడు. 'నేను సన్యాసి' అని చెప్పుకున్నంతకాలము అతను నిజమైన సన్యాసికాడు. 'నేను సంసారి, సంసారి' అని చెప్పుకున్నంతకాలము వాడు సంసారికాడు. యివి రెండుకూడను వారి భ్రాంతులే! ఆ భ్రాంతిని యేనాడు మనము విసర్జించుకొందుమో ఆనాడే మనము నిజమైన ఆత్మ స్వరూపములవుతాము. కనుక యీ భ్రాంతులను దూరముచేసి, సేవకంటె మించినది మరొకటిలేదనే సత్యాన్ని గుర్తించాలి. మన active workers అందరుకూడను యీసత్యాన్ని నేటినుండి గుర్తించుకొని పాపభీతి, దైవప్రీతి, సంఘములో నీతిని సాధించాలి. నిజముగా మనలో దైవప్రీతియే వస్తే తక్షణమే పాపభీతి యేర్పడుతుంది. ఈ రెండూచేరిన సంఘములో మనము నీతిని సాధించగలము. అదే మానవజాతికి జ్యోతి. కనుక, ప్రతి వ్యక్తికూడను దైవభావాన్ని పెంచుకోటానికి ప్రయత్నించాలి. సమాజసేవకు మనము నడుంకట్టాలి. ఈ రెండే మనకు నిజమైన మార్గములు. ప్రేమ, సేవ రెండూ రెండు రెక్కలు మనకు.

**పక్షిబలమున యెగిరెడు పక్షులట్లు**
**ఆది విహగమార్గంబుల ననుసరించి**
**చేరవలయును గమ్యంబు శీఘ్రగతిని**
**సద్గుణబులు త్యాగంబు సత్యనిష్ఠ**
**లేని జీవుడు ప్రాణంబులేనివాడే**
**సేవచేయని జీవుడు చీకటింటి**
**అంధజీవుడనుచు చెప్పవచ్చు**

సేవ లేకపోతే వాడు కేవలం అంధుడనే చెప్పవచ్చు. కనుక ప్రేమ, సేవ రెండూ మనకు రెండు కన్నులు. ప్రేమ, సేవ యివి రెండు రెక్కలు. ఈ రెండు రెక్కలను మనము సాధించితిమా మన జీవితము గమ్యాన్ని సులభముగా చేరిపోతుంది. సత్యాన్ని గుర్తిస్తాము. సత్యజీవితాన్ని గడుపుతాము. కనుక, మన సేవకులయందు యీ రెండూకూడను చాలా అవసరంగా పెంచుకోవాలి.

srisathyasaivachanamrutam

ప్రేమ, సేవ. దైవప్రేమమటుకే కాదు. దైవము సర్వత్రా వుంటున్నాడు. 'ఈశావాస్య మిదంసర్వం'. అందరిని ప్రేమించినట్లుగా నటించి, ద్వేషించటం చాలా దోషము. తలచినవి చెప్పటము, చెప్పినవి చేయటము. అప్పుడు మనకు యెట్టి యిక్కట్టు వుండవు. ఎట్టి అశాంతికి అవకాశము వుండదు. ఎట్టి దుఃఖము మన దరికిరాదు.

## దుస్సంకల్పములను యేమాత్రము దరికి చేరనీయకూడదు

సంకల్పములయొక్క ప్రభావాన్ని యింకా చక్కగా అర్థము చేసుకోటానికి ప్రయత్నించాలి. సంకల్పములు ఒక మనిషినుంచి మరొక మనిషికి ప్రయాణమవుతూవుంటాయి. ఇంతేకాదు, యెవరి చెడ్డనైనా మనము కోరుతూవుంటే మన సంకల్పములు అతనికి చెడ్డచేసి అతనికి చేసిన చెడ్డకంటె పదింతలు యెక్కువగా మనకే వచ్చిచేస్తాయి. మనము అనుకుంటాము, 'నేను అతనికి చెడ్డ కోరుతున్నాను. అతను యేనాడు నాశనమౌతాడా, యేనాడు చెడిపోతాడా, యేనాడు భ్రష్టుడౌతాడా' అని. కాదు కాదు. అవి మనము యెంతకోరినామో అంతకు పదింతలు అవి మనకే వచ్చి మనలను భ్రష్టుచేస్తాయి. కనుక, దుస్సంకల్పములను మనము యేమాత్రము దరికి చేరనీయకూడదు. అందరి మంచిని కోరాలి. అందరిని ప్రేమించాలి. దానికి నేనే సాక్షి. నేను అందరిని ప్రేమిస్తాను. దుష్టులనుకూడను ప్రేమిస్తాను. నన్ను దూషించినవారిని మరింత ప్రేమిస్తాను. నన్ను హాస్యముచేసినవారికి యింకా దరికి చేరుతాను. దానివల్ల నాకుయెంతో ఆనందము కలుగుతూవుంటుంది. కనుకనే My life is My message అంటాను. ఎప్పుడూ నాకు త్యాగమే! త్యాగమేగానీ నాకు యేనాడు భోగమనేది లేదు. త్యాగమే నా భోగము. కనుక workers అందరు కేవలము భోగరాజులుగా తయారుకాకుండా త్యాగరాజులుగా, యోగరాజులుగా తయారుకండి! సమాజాన్ని మనము పోషించాలి. సమాజముయొక్క ఔన్నత్యాన్ని చూడాలి అనే ఆశ కల్గినవాడు నాది అనేది ఈశ్వరార్పణ గావించి సమాజములో ప్రవేశించాలి. ముఖ్యముగా యీ సమావేశములో అందరు తెలుసుకోవలసినది ఒక్కటివుంది. మన శక్తికొలది మనము సేవలు చేద్దాము. మితిమీరిన భారాలు మన తలపైన వేసుకోనక్కరలేదు. ఈ సేవలకు శరీరము, మనసు రెండూ కావాలి. చెయ్యాలనే

sri sathyasai vachanamrutam

సత్సంకల్పము, ఆ సంకల్పమును అనుసరించటానికి సరైన శక్తిసామర్థ్యములు కల్గిన దేహము రెండూ అవసరము. ఇంతేకానీ, ధనకనక వస్తువాహనాదులతో యేమాత్రము సంబంధము లేదు.

**సాయిసంస్థలలో డబ్బుండికూడ సద్వినియోగము చేయనివాడు కేవలం దరిద్రుడే**

ధనమునకు స్థానాన్ని యివ్వటంచేతనే మన బలమంతాకూడను క్షీణించిపోతున్నాది. ఇచ్ఛాశక్తి మరింత క్షీణించిపోతున్నాది. వ్యక్తులలో ఒకవిధమైన భేదాభిప్రాయములు పెరిగిపోతున్నాయి. ఈ ధనమే మన క్షీణదశకంతా మూలకారణము. అయితే, నిత్యజీవితములో సంసారికి ధనము అత్యవసరమే! ఆ ధనము యెంతవరకు వుంటుండాలంటే మన కాలికి బూట్సులు వేసుకుంటాము. ఆ బూట్సులు సరైన కొలతగా వుండినప్పుడే మనము చక్కగా నడచటానికి సులభముగా వుంటుంది. ఆ బూట్సులు కొంచెము లూజుగా వుంటే నడచటము కష్టమే. ఈ బూట్సులు టైట్‌గా వుంటేకూడను నడచటం కష్టమే. అదేవిధంగా ధనము అధికముగా వుండినా మనకు నష్టమే. ధనము చాలా తక్కువగా వుండినా కష్టమే. మనము జీవించటానికి, యెవరైనా యింటికివస్తే యింత పెట్టటానికి యింత మాత్రము మనకు చాలు. వున్నవారే ధనము, ధనము అని ధనము కోసము పాటుపడి దాసానుదాసుడైపోయి జీవితమును వ్యర్థము గావించుకుంటున్నారు. ఈ దురాశను దూరముగానెట్టండి. ఎంత సంపాదించినా గానీ యేనాడో ఒకనాడు వదలిపోక తప్పదు. ఇలాంటి దాని నిమిత్తమై మనము యెందుకింత ప్రాకులాడటం? నీ కర్తవ్యాన్ని నీవు నిర్వర్తించుకో! మన సంస్థలలోపల యీ డబ్బును ఆశించే దుర్బుద్ధిని మాత్రము యీనాటినుండి మీరు దూరముచేసుకోండి. డబ్బుతో మనకు సంబంధమే వద్దు. మనకు సేవతో సంబంధము. సత్సంకల్పమే నీవు పెంచుకుంటుంటే సర్వేశ్వరత్వమే నీకు అన్నీ అనుగ్రహిస్తుంది. మీరు పదిమందికి సేవ చేయాలని వుంటుంటే డబ్బున్నవారు మనలో లేరా? వున్నవారు ఎవరో ఒకరో యిద్దరో దానికి సహాయపడి ఆ కార్యము మనము సాధించవచ్చుకదా! సాయి సంస్థలలో డబ్బువుండికూడ సద్వినియోగము చేయనివాడు దరిద్రుడే! అలాంటి దరిద్ర జీవితాన్ని మనము గడపరాదు. త్యాగజీవితాన్ని గడపాలి. సాయి

sri sathyasai vachanamrutam

సంస్థలు దినదినమునకు పెరిగిపోతున్నాయి. ఈ దురాశలు మనము దూరముగా నెట్టాలి. యీనాటినుండికూడను మనయొక్క సంస్థలలో సేవ, భక్తి, త్యాగము, సహనభావము పెంచుకోవాలి. ఈ విధముగా వుండినప్పుడు మనలో కలతలకుగాని, భేదములకుగాని యేమాత్రము అవకాశమంటూ వుండదు. ఈనాడు కొన్ని విధములైన అభిప్రాయభేదాలున్నాయంటే మానవులలో యివి ధనముతో ప్రారంభమైనవే!

**పని చేయకుండా ఊరికే మాట్లాడేవాడు ఈ సంస్థలో ఉండటానికి అర్హతలేనివాడు**

మరొక విషయాన్నికూడను మనము గుర్తించాలి. నేను ఆఫీసుబేరర్‌ను అని అధికారాన్ని చెలాయించటం మన సంస్థలలో వుండరాదు. అందరూ సేవకులే! నిజంగా యీనాడు యీ సమావేశము మనం జరుపుకుంటున్నామంటే చాలా పవిత్రమైన సమావేశమిది. Workers కర్మలాచరించేవారు. Active workers అంటే యేమిటి? కర్మలను ఆచరించేవారి సమావేశమిది. ఇంతకుముందు యేదో State Presidents మీటింగని, యింకా ఆఫీసుబేరర్సు మీటింగని యెన్నో జరిపాము. అవన్నీ వ్యర్థమైనవి. అందులో వర్కుచేసేవాడు ఒక్కడైనా నాకంటికి కన్పించలేదు. వీళ్లందరితో పనిచేయించేది, తాను చేశానని గర్వంగా చెప్పుకొనేది! ఇలాంటి దుర్బుద్ధులు మనలో దూరంచేసుకోవాలి. నాకు వర్కర్సే ప్రీతి. పనిచేసేవాడు కావాలి. కనుక యీనాటినుండి పనిచేయనివాడు యెవడుండినా వాడిని తీసివేయండి. పనిచేసేవారు పదిమందివుండినా చాలు. కనుక యీ మన సమావేశములోపల నిర్ణయము గావించుకోవలసినది యేమంటే పనిచేసేవారు కావాలి. వాని ధనమో, వాని హోదానో, కీర్తో, వాటితో మనకు పనిలేదు. మనకు పనిచేసేవారు చిక్కాలి. అందరూ పనిచేసేవారుగానే తయారుకావాలి. పనిచేయకుండా వూరికే మాట్లాడేవాడు యీసంస్థలో వుండటానికే అధికారికాడు. ఒకరినొకరు విమర్శించేవారు యీ సంస్థలో వుండరాదు. అహంకారముగా అధికారాన్ని చెలాయించేవాడు అసలే వుండరాదు. ఎవరి శక్తికి తగినట్లు వారు పనిచేసి నిరూపించాలి. అందుకోసమనే 'దాసానుదాసుడను కావలెనురా! నీ దాసులకు సేవనే చేయవలెరా!' అన్నాడు, ఒక కవి. కనుక, మనము దాసానుదాసులుగా తయారుకావాలి. అప్పుడే దైవదాసులుగా రూపొందటానికి

sri sathyasai vachanamrutam

వీలువుతుంది. పరదూషణను యీనాటినుండి మనము త్యజించాలి. సర్వులనూ అన్నదమ్ములవలె ప్రేమించాలి. సర్వులయందు భగవంతుడున్నాడనే విశ్వాసాన్ని పెంచుకోవాలి. ధనముతో సంబంధములేని సేవలు మనము ఆచరించాలి. అదియే సత్యసాయి సంస్థలయొక్క ప్రధానమైన ఆదర్శము.

**నాల్గు సంస్థలతో సంబంధమున్నవాడు ఏ సంస్థలోకూడా తృప్తిగా పని చేయలేడు**

మరొక విషయాన్నికూడను మీరు గుర్తులో పెట్టుకోవాలి. ఒక్కొక్కరు మూడు నాల్గు సంస్థలలో మెంబర్సుగా వుంటారు. అధికారులుగా వుంటారు. అనగా ఒక్క సాయిసంస్థలయందు మాత్రమేకాదు, వేరే సంస్థలలోకూడా ఆఫీసు బేరర్సుగా ఉంటారు. ఒక సంస్థలో ప్రెసిడెంటుగా వుంటాడు. ఇంకో సంస్థలో సెక్రటరీగా వుంటాడు. సత్యసాయి సంస్థలో ఒక అధికారిగా వుంటాడు. ఈ విధంగా మూడుసంస్థలతో సంబంధము పెట్టుకున్నవాడు సాయిసంస్థతోకూడా సంబంధం పెట్టుకోటంచేత ఏ పనికూడను సక్రమంగా పూర్తిచేయలేడు. ఎవరైనాసరే సత్యసాయి సంస్థేకాదు, మరొక సంస్థేకాదు యెక్కడ చేసినప్పటికినీ తనయొక్క కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించాలి. నాల్గు సంస్థలతో సంబంధమువున్నవాడు యేసంస్థనుకూడ సంతృప్తిపరచలేడు. కనుక ఇటువంటివారు సత్యసాయి సంస్థలలో చేరనక్కరలేదు. సత్యసాయి సంస్థలలోపల సేవాదళములోవుండనీ, సత్సంగములోవుండనీ, స్టడీసర్కిల్‌లోవుండనీ, వీటిలో యెన్నిటిలోనైనా వుండవచ్చును. కాని, రెండవ సంస్థలోమటుకు మెంబరుగా వుండటానికి వీలుకాదు. ఎన్నో రోజులుగా యింకొక సంస్థలోవుండినవాడు యిందులో వుండకూడదనే దుర్భావముకాదు. ఆ సంస్థలో తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించలేడు. ఈ సంస్థయందుకూడను సక్రమంగావుండలేడు. ఏదైనా ఒక్కటి మాత్రమే తీసుకొని దానిని పూర్తిగా, సంతృప్తిగా ఆచరించటానికి ప్రయత్నించాలి. మీకందరికీ తెలుసు. రెండుగుఱ్ఱాలపైన సవారి యెంత ప్రమాదం కలిగిస్తుందో! రెండు సంస్థలలోపల వుంటే యే పనికూడను మనము పూర్తిచేయలేము. ఏదో అధికారంకోసం, పేరు ప్రతిష్ఠలకోసం మనము సంస్థలలో మెంబర్లు అవుతాము. యివి కేవలం ఒక విధమైన దుర్గుణములు అని చెప్పవచ్చు. మీరందరు

sri sathyasai vachanamrutam

యీనాడు వర్కర్సుగా వచ్చారు. అన్ని పనులు మీవల్లనే జరుగుతున్నాయి. ఈనాడు అభివృద్ధిగాంచిన సమస్త కార్యములు మీవల్లనే జరిగినవి. ఇవి యేవీకూడను అధికారులవలన జరిగినవికావు. మీరు నిజంగా సార్థకజీవులు. ఎంత త్యాగబుద్ధితో మీరు సేవలను అందించారు! యీసేవకులే చాలు.

**త్యాగులే యోగులు**

త్యాగముకంటె మించిన గుణంలేదు. దీనికంటె మించిన ధనంలేదు. త్యాగులే భగవంతునికి యోగులు. స్వామి యింత కఠినముగా చెప్పారని మీరు దీనినుంచి విసర్జించుకొని పోవటానికి ప్రయత్నం చేయకూడదు. దీనిలోవుండే మీరు పనిని సాధించాలి. ఇది మీ మంచి కోసమనే చెప్పటము. మీరు సేవలంతాచేసి గొప్ప కీర్తిని సంపాదించుకుంటే నాకొచ్చే ఫలితమేమీ లేదు. మీరు సేవలుచేయకుండా దూరమైపోతే నాకొచ్చే నష్టమేమీలేదు. ఈ యొక్క క్షేమము, యీ యొక్క నష్టము మీకే! కనుక సేవలలోనేవుండి ఒక పట్టును పట్టి దీనిని సాధించటానికి తగిన ధైర్యసాహసాలను మీరు సంపాదించుకోవాలి. ప్రేమస్వరూపులారా!

**పట్టినదేదియో పట్టనే పట్టితివి**
**పట్టునెగ్గెడుదాక అట్లెయుండు**
**కోరినదేదియో కోరనే కోరితివి**
**కోర్కె చెల్లెడుదాక కొలిచియుండు**
**అడిగినదేదియో అడగనే అడిగితివి**
**అడిగినదిడుదాక విడువకుండు**
**తలచినదేదియో తలచనే తలచితివి**
**తలపు తీరెడుదాక తరలకుండు**
**పోరుపడలేక తానైన బ్రోవవలయు**
**ఒడలు తెలియక నీవైన అడుగవలయు**
**అంతియెకాని మధ్యలో ఆపివేసి**

sri sathyasai vachanamrutam

**తిరిగిపోవుట భక్తుని దీక్షకాదు.**

కనుక, యీసంస్థలను దినదినాభివృద్ధిగావించి సేవలయందే, భగవద్భక్తియందే మనయొక్క జన్మను సార్థకము గావించుకోవాలి.

**భజన సెంటర్లు, బాలవికాస్ తరగతులు పెంచాలి**

ఇందూలాల్‌షా చెప్పినట్లుగా మొట్టమొదట దైవభక్తి అనగా spritual wing. రెండవది, బాలవికాస్ అనగా విద్యకు సంబంధించినది. మూడవది, సేవకు సంబంధించినది. ఈ మూడు విభాగములు మనకు చాలు. ముచ్చటగా మూడు పెట్టుకొని ఆనందముగా మురిసిపోవచ్చును. దైవభక్తి కోల్పోవటంచేతనే మన భారతదేశం యీనాడు యిటువంటి దురవస్థలకు గురౌతూవచ్చింది. మనవారు భజన సెంటర్లు అభివృద్ధిగావించి యీ భజనలు చక్కగా ప్రాక్టీసు చేయటానికి ప్రయత్నం చేయాలి. శ్రావ్యమైన స్వరంతో వింటూవుంటే హృదయమంతా పొంగిపోవచ్చును. అపస్వరములతో తాళవిరుద్ధముగా పాటలు పాడుతుంటే హృదయము మండిపోతుంది. అనేకమంది హృదయాన్ని మనము ఉల్లాసంగా ఉప్పొంగింప చేయాలనుకుంటే పవిత్రమైన కంఠముతో పాడి భజనలుచేసి భగవంతుని కీర్తించినామంటే ఆ హృదయమెంతో ఆనందాన్ని అనుభవిస్తుంది. సామూహిక భజనలు అభివృద్ధిగావించాలి. ఈ భజన ట్రైనింగుకూడను మనము అభివృద్ధిగావించాలి. పెద్దలు ముదిరిపోయిన వృక్షాలే! ఇక యీ వృక్షాలు వంచటానికి వీలుకాదు. చిన్నచిన్న పిల్లలను యీనాటినుండికూడను అభివృద్ధిగావిస్తూవస్తే భవిష్యత్తులో వారు మన భారతదేశానికి ఆధ్యాత్మిక ఆదర్శమును నిరూపించగలరు. బాలవికాస్‌ను అమితముగా పెంచాలి. భజన సెంటర్లు పెంచాలి.

**సత్యసాయి సంస్థలలో ఆఫీసు బేరర్లు ఎక్కువైపోయారు**

ఈ సేవాసంస్థలలోపల మనము విరివిగా అందరిని చేర్చుకోవాలి. సేవలు చేయటానికి అందరికి అధికారము వుంటుండాది. కనుక, యిందులో ఒక్కొక్క అధికారి, ఒక్కొక్క

srisathyasaivachanamrutam

సేవాదళము లీడరు, ఒక్కొక్క సేవాదళము ప్రెసిడెంటు. యీ విధమైనదిలేకుండా సేవ చేసేటువంటి వ్యక్తులలోనే వుత్తముడైన వానిని అధికారిగా పెట్టినప్పుడు సేవా కార్యక్రమములు యెంతో అన్యోన్యంగా అభివృద్ధిగాంచుతాయి. ఈనాడు ఆఫీసు బేరర్సు మితిమీరిపోయినారు. ఎక్కడైనా ఒక సమావేశము జరుగుతూవుందంటే అంతా ఆఫీసు బేరర్సే వుంటారు గాని, వర్కుచేసేవారు అక్కడ యెవ్వరూ కనుపించరు. ఒకరు ప్రెసిడెంటు అని, ఒకరు వైస్‌ప్రెసిడెంటు అని, ఒకరు కన్వీనరు అని, కోఆర్డినేటరు అని, కమిటీ మెంబరు అని యేమిటేమిటో యీ కమిటీలు అనవసరంగా పెరిగిపోతున్నాయి. ఎక్కడైనా మీరు చూడండి. ఎక్కడైనా మినిష్టరు వస్తున్నాడంటే ప్రజలకంటే పోలీసులు యెక్కువగా వుంటారు. అట్లానే మన సమావేశములలోపల ఆఫీసు బేరర్సు అధికముగా వుంటున్నారు. ఎవరికోసం యీ ఆఫీసు బేరర్సు మీటింగు పెట్టారో అర్థం కావటంలేదు. ఆఫీసు బేరర్సును క్రమక్రమేణా తగ్గించాలి. తెలుగులో ఒక సామెత వున్నాది. మనుషులు పెరిగేకొద్ది మజ్జిగ పలచన అయిపోతుందట! ఏదో ఐదు లేక ఆరుమంది వుంటుంటే గట్టిపెరుగు వేసుకోవచ్చు, జనులు యెక్కువైపోయారంటే నీళ్లు పోస్తారు. అదే విధముగా మన సంస్థలలోపలకూడను ఆఫీసు బేరర్సు అధికమైపోతే పనులన్నీ పలుచనైపోతున్నాయి.

**సర్వమత సమ్మతమే సాయిమతము**

యీవిధమైనటువంటి కూర్పులు, మార్పులు యీ వరల్డు కౌన్సిలువారు సరైన దృష్టిలో వుంచుకొని దీనిని సరైన మార్గానికి తెస్తారని నేను ఆశిస్తున్నాను. నిజంగా యీ ఆర్గనైజేషన్‌కు, నాకు యెట్టి సంబంధములేదు. నాకు, మీకు సన్నిహిత సంబంధముంటుండాది. ఇది యెవ్వరు దూరము చేయటానికి వీలులేదు. ఇది ఒకరితో కలిపించుకున్నదికాదు. కనుక, ఆర్గనైజేషన్‌లోపల అందరూ అన్యోన్యముగాచేరి, సోదరభావముచేత ఒకరినొకరు సంప్రదించుకొని సవరించుకోటానికి తగిన కృషి చెయ్యాలి. ఒకరితో ఒకరికి యెట్టి అభిప్రాయభేదములు వుండరాదు. ఈ విధమైన భావములుంటే సంస్థను మనము అభివృద్ధిగావించలేము. ఎవరైనా దానిని సరిచేసి వారిద్దరిని చేర్చటానికి తగినకృషి చెయ్యాలి. అయితే ఒకటి! యిన్ని వేలమంది వుండినప్పటికి యిలాంటి సంస్థ

యీనాటివరకు యెక్కడా పెరగలేదు. ఏదో కొంత స్వార్థము, స్వప్రయోజనము వుండక తప్పదు. అందరూ ఒకే తల్లిబిడ్డలు. కవులు చెప్పుతూ వుంటారు

**ఒక్కగూటి పిట్టలం**
**ఒక్కతీగ పువ్వులం**
**ఒక్కతల్లి పిల్లలం**
**ఒక్కజాతి బిడ్డలం**
**మనలో మనకు కలతలెందుకు?**

కనుక, ఒకరితో ఒకరికి యేవిధమైన అభిప్రాయభేదములకు అవకాశము యివ్వరాదు. ఒక్కజాతి పౌరులం మనమంతా! అదే మానవజాతి. మన సంస్థలో జాతి, మత, కుల, వర్గ వివక్షత లేదు. సర్వమత సమ్మతమే మన మతము. దీనినే అభిమతముగా విశ్వసించాలి. ఎలాంటి భేదములులేకుండా అందరూ మానవజాతికి సంబంధించినవారని, యేవిధమైన కలతలులేకుండా అందరూ ఈ సేవలలో పాల్గొని ప్రాచీన సంప్రదాయములోవుండిన ధర్మాన్ని మనము పోషించటానికి ప్రయత్నించాలి.

ఈ సేవయే గొప్ప సాధన. ఈ సాధన తప్పి యేదో ఇతర సాధనలు చేస్తున్నామంటే సరికాదు. జపమాల తిప్పుతూ వుంటాడు, మనసు యెక్కడో తిరుగుతూ వుంటుంది. ఇలాంటి అర్థములేనటువంటి సాధనలు చేయటానికి ప్రయత్నించకండి. ధ్యానములోకి పోతుంటారు. ఆ ధ్యానము యెక్కడికి పోతుందో! యే చాకలింటికో, మంగలింటికో పోతుంటాది. యీ ధ్యానంచేసే దానికంటె మనుషులను చక్కగా సేవించటానికి తగిన ప్రయత్నం చేయండి. నీవే దైవమైవుండి యింకెవరిని ధ్యానంచేయటం? యీ విశాలభావాన్ని మనం పెంచాలి. ఇది విశాలమైన ప్రపంచము. ఈ విశాలమైన ప్రపంచములో విశాలమైన భావాలు రావాలి. ఈ విశాలభావములు మనలో యేనాడు వస్తాయో ఆనాడే మనం దైవత్వాన్ని పొందగలం.

**భ్రమ నీలో వుండునంతవరకు బ్రహ్మను చూడలేవు**

ఈనాడు మనముచేసే పూజలుగాని, ధ్యానముగాని, జపముగాని దైవాన్ని



sri sathyasai vahini amrutam

సంకుచితపరచే రీతిలో వున్నాయి. విశ్వస్వరూపుడైన భగవంతుని చిన్నఫోటోలుగా చేసుకొని ఫ్రేముకట్టి పూజలోపెట్టి అక్కడే వున్నాడు దేవుడని అక్కడికిపోయి నమస్కారంచేస్తే దైవాన్ని యెంత కించపరచినట్లవుతుంది! దైవము యేనాటికిని నీ మ్రొక్కులకు చిక్కడు. ఈనాటి భక్తులు యెలా వున్నారంటే అంత అజ్ఞానములో మునిగివున్నారు. ఏవిధంగా వున్నారంటే, పదిలక్షల రూపాయలు తీసుకుని వీడు భగవంతునికి వెయ్యిరూపాయలు యిచ్చే లోభత్వంతో నిండి వున్నాడు. ఇది ఎంత బుద్ధి తక్కువ చెప్పండి! వీడిదగ్గర వెయ్యిరూపాయలు తీసుకున్న భగవంతుడు వీడికి పదిలక్షలు యెలా యిస్తాడు? ఇంకా కొన్ని విపరీతమైన, వికృతమైన కోరికలు.

'స్వామీ! నాకు ఉద్యోగం కనుక లభించిందంటే వచ్చే నెల నీ గుడికి వచ్చి నా వెంట్రుకలంతా నీకిస్తాను' అని మ్రొక్కుతాడు. ఈ తుచ్ఛమైన బొచ్చునిచ్చి ఉచ్ఛమైన కోరికలు కోరటం యెంత అవివేకము! భగవంతునికి యివ్వవలసినది యేదీలేదు. పుచ్చుకొనే భగవంతుడు ప్రత్యేకముగా మరొకడు లేడు. రెండూ నీవే అయివుంటున్నావు. ఇవన్నీ భ్రమలే నీకు. ఈ భ్రమ నీలో వుండినంత వరకు బ్రహ్మను చూడలేవు. కనుక, క్రమక్రమేణా యీ భ్రమను తొలగించుకోటానికి తగిన కృషి చేయండి. ఆత్మసాక్షాత్కారం కోసం మేము సాధన చేస్తున్నామంటారు. ఆత్మ సర్వత్ర వుంటూనే వున్నది. ఇక నీవు సాధనచేసేది దేనికోసం? ఆత్మ కోసంకాదు. అనాత్మను తొలగించుకుంటే ఆత్మ అక్కడే వుంటుంది. కనుక అనాత్మను తొలగించుకోటానికి తగిన కృషి మీరు చేయండి. ఈ అనాత్మ తొలగాలంటే సేవద్వారానే తప్ప అన్యమార్గములో యిది లభ్యముకాదు. కనుక service, service; సేవ, సేవ. ఎవరినీ మనము దూషించరాదు. ఎవరినీ మనము విమర్శించరాదు. ప్రేమతో సేవలలో మనము పాల్గొనాలి. ఈ ప్రేమనే పరమాత్మ స్వరూపకముగా విశ్వసించాలి.

**(తేదీ 21-11-1987న పూర్ణచంద్ర సభామంటపములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam